క్లుప్తంగా

మోడల్ స్కూల్ విద్యార్థులకు కంటి పరీక్షలు



క్రోసూరు: క్రోసూరులోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ మేరీ సూజన్ తెలిపారు. పెదకాకాని, శంకరకంటి ఆసుపత్రి, పల్నాడు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ



అచ్చంపేట: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో ఏకుల ప్రసాదరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఓర్వకల్లు, రుద్రవరం గ్రామాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హాజరు పట్టికలను, మధ్యాహ్న భోజన పథకం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలన్నారు. శుచి, శుభ్రతలను పాటించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. తరగతుల సామర్థ్యాలపై విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

కాపు వన సమారాధనను విజయవంతం చేయాలి



సత్తెనపల్లి: పట్టణంలోని నాగార్జున నగర్‌లోని కాపు హాస్టల్ వద్ద ఈ నెల 17న కాపు యువత ఆధ్వర్యంలో నిర్వహించే సత్తెనపల్లి పాత తాలూకా కాపు వన సమారాధనను విజయవంతం చేయాలని కాపు సంఘ నాయకులు కోరారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లోని కాపు హాస్టల్ వద్ద సోమవారం కాపు వనసమారాధనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కాపు వన సమారాధనకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు బగ్గి నరసింహారావు, పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), రంగిశెట్టి సుమన్ కుమార్, పెద్దింటి వెంకటేశ్వర్లు, ఆకుల హనుమంతరావు, బండి వేణు, అమ్మిశెట్టి రత్నాకరరావు తదితరులు ఉన్నారు.

నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



నకరికల్లు: ఉచితంగా నైపుణ్యాలపై శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య గణన దోహద పడుతుందని ఎంపీడీవో జి.కాశయ్య అన్నారు. నైపుణ్య గణన చేపట్టనున్న సచివాలయ సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లోగా నైపుణ్య గణన కార్యక్రమం ప్రారంభించాలన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది 15 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల వారి వివరాలు సేకరించాలన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో ఆధార్ ఓటీపీ ద్వారా 45 రకాల కాలమ్స్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.వి.ఎస్.ప్రసాద్, నైపుణ్య శిక్షణాధికారి ఇ.రామకృష్ణారెడ్డి, సీడాప్ జేసీవో వై.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులకు శిక్షణ

అచ్చంపేట: స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఈ నెల 15, 16 తేదీల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. డైరెక్టర్, ఏపీఎస్ఐఆర్డీపీఆర్, విజయవాడ ఉత్తర్వుల ప్రకారం రెండు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆర్జీఎస్ఏ(రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్)పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వీరిని గుర్తించే వారే లేరా..!?

పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్‌లకు వేతన కష్టాలు

- గత నాలుగు మాసాలుగా చెల్లించని వేతనాలు
- ఉద్యోగ భద్రత కల్పించాలలని
- 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను కేటాయించాలని కార్మికుల డిమాండ్



నకరికల్లు ఎంపీపీ మెయిన్ పాఠశాల సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

నకరికల్లు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆలనాపాలనా చూస్తూ పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఆయాల భవిష్యత్తును కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. ఇది మంచి ప్రభుత్వం అంటూ గోడలకు, గడపలకు స్టిక్కర్లు అంటించడంలో చూపిన శ్రద్ధ మురుగు లేకుండా శుభ్రం చేసే ఆయాలపై లేకపోయింది. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు సొంత కుటుంబసభ్యుల కన్నా మిన్నగా చూస్తుంటారు ఆయాలు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే వారికి అనారోగ్యం ఎక్కడ వస్తుందోనని కంటికిరెప్పలా కాపాడుకుంటారు. 100 నుంచి 300 మంది విద్యార్థులకు ఒక ఆయా చొప్పున పనిభారం ఉన్నప్పటికీ గత్యంతరం లేక ఇదే పనిలో కొనసాగుతున్న శానిటేషన్ వర్కర్‌లుగా పిలువబడే ఆయాల దయనీయ పరిస్థితి ఇది.

● మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 30 ప్రాథమిక పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఒక ఆదర్శ పాఠశాల ఉన్నాయి. మొత్తం 4,882 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో శానిటేషన్ వర్క్ (పారిశుద్ధ్య పనులు) కోసం 49 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

ప్రభుత్వం మారాక నేటి వరకు వేతనాలే లేవు

పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న శానిటేషన్ వర్కర్‌లకు నెలకు రూ.6 వేల చొప్పున ప్రభుత్వం వేతన రూపంలో చెల్లిస్తుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కార్మికుల కష్టాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. 2024 జులై, ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్ మాసాలకు చెల్లించాల్సిన వేతనాలు బకాయిల రూపంలోనే మిగిలిపోయాయి. మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పారిశుద్ధ్య జాయింట్ డైరెక్టర్‌ను కార్మిక సంఘాల నాయకులు పలుమార్లు కలిసి విన్నవించినా ప్రభుత్వం నుంచి వేతనాల మంజూరుకు అనుమతులు లభించలేదు.

పారిశుద్ధ్య కార్మికుల ప్రధాన డిమాండ్‌లు ఇవే

ప్రస్తుతం కేటాయించిన రూ.6 వేల స్థానంలో సమాన పనికి సమాన వేతనం రూపంలో వేతనం పెంచాలని, గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రతి నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, పారిశుద్ధ్య పనులు చేసేందుకు పరికరాలు, రెండు జతల యూనిఫాం ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి, ప్రమాద బీమా, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి, పనిభారం తగ్గించి 50 మంది విద్యార్థులకు ఒక ఆయా చొప్పున మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



పాఠశాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. శ్రమ దోపిడి విధానాన్ని మానుకొని కష్టానికి తగిన వేతనం ఇవ్వాలి. ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెలా జీతాలు ఇవ్వాలి. 50 మంది పిల్లలకు మాత్రమే ఒక ఆయాను కేటాయించాలి. న్యాయమైన ఈ డిమాండ్లను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై ఉద్యమించి సాధిస్తాం.

– ఈవూరి లక్ష్మారెడ్డి, సీపీఎం సీనియర్ నాయకులు

ఆజాద్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రపాల్, నాయకులు

సత్తెనపల్లి: స్వాతంత్య్ర సమరయోధుడు, భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ కో ఆర్డినేటర్ చుక్కా చంద్రపాల్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. చుక్కా చంద్రపాల్ మాట్లాడుతూ స్వాతంత్య్ర సంగ్రామంలో గాంధీ, నెహ్రూలతో పాటు ఆజాద్ చురుగ్గా పాల్గొన్నారన్నారు. విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. 1992లో ప్రభుత్వం భారతరత్న ప్రకటించిందని తెలిపారు. ఆజాద్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాధంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, నాయకులు షేక్ బాన్‌బాషా, కొరబండి ఆంథోని, జిల్లెళ్ల పాల్‌రాజ్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా చంద్రపాల్



చుక్కా చంద్రపాల్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా చుక్కా చంద్రపాల్‌ను నియమించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్ రాజ్‌పాల్ అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి మాట్లాడుతూ చంద్రపాల్ చేస్తున్న సేవలను గుర్తుంచుకొని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కో ఆర్డినేటర్‌గా నియమించటం హర్షణీయమన్నారు. దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్ మాట్లాడుతూ నిస్వార్థంగా పార్టీకి సేవ చేస్తూ, పార్టీ పటిష్టత కోసం కష్టపడుతున్న చంద్రపాల్‌కి కో ఆర్డినేటర్‌గా మళ్లీ అవకాశం ఇవ్వటం శుభ సూచకమన్నారు. ఎస్సీ సెల్ కన్వీనర్ బొక్క చిన్న గురువులు మాట్లాడుతూ పని చేసే వారిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు గుర్తిస్తుందని, చంద్రపాల్‌ని చూస్తే అర్థమవుతుందన్నారు. పలువురు నాయకులు మాట్లాడి చంద్రపాల్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త లక్ష్మయ్య, నాయకులు చాంద్ బాషా, ఆరిఫ్, కోట ఆనంద్, రవితేజ, జెట్టి శేఖర్, సిద్దల మోహన్‌రావు, జిల్లెళ్ల పాల్‌రాజు, కొరబండి అంతోని, షేక్ మస్తాన్ వలి, షేక్ హైదరాలి, వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు అయ్యప్ప దేవాలయంలో శంకరునికి అభిషేకం

సత్తెనపల్లి: కార్తిక శుక్ల ఏకాదశి సందర్భంగా మంగళవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల అయ్యప్ప స్వామి దేవాలయంలో భవాని శంకరుల పంచాయతన శివాలయంలో స్వయంగా ఆవు పాలతో శంకరునికి అభిషేకం చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని కమిటీ బాధ్యులు సోమవారం తెలిపారు. భక్తులందరూ హాజరై స్వామి వారికి స్వయంగా అభిషేకం చేసుకొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రహదారి సమస్యను పరిష్కరించండి

సత్తెనపల్లి: రహదారి సమస్యను పరిష్కరించండి మహాప్రభో అంటూ పట్టణంలోని 6వ వార్డు శివాజీ నగర్ 6వ లైన్‌కి చెందిన పలువురు సోమవారం గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6వ వార్డు శివాజీ నగర్ 6వ లైన్ ఎస్‌బీజీ డిగ్రీ, పీజీ కాలేజీ దగ్గర గతంలో రోడ్డు సగం వేశారన్నారు. మిగిలిన సగం మట్టిరోడ్డు ఉందని, దీనిపై రాకపోకలకు చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. వర్షం వస్తే నడవడానికి, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. రోడ్డు గుంతలుగా ఉండటం వలన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని, మున్సిపల్ కార్మికుల చెత్త బండి కూడా రావడం లేదన్నారు. దీంతో ఇక్కడ నివాసితులు చెత్త రోడ్డు పక్కన పడవేయడంతో మరుగుదొడ్లకు నిలయంగా మారిందన్నారు. దీని వలన దోమలు ఎక్కువై మలేరియా, డెంగీ లాంటి వ్యాధులకు గురికావాల్సి వస్తుందన్నారు. మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చి చెత్త బండి వచ్చి అక్కడ ఉన్న చెత్తను ప్రతి రోజు తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

సాగునీటి పారుదల అడ్డంకులను తొలగించండి



వావిలాలనగర్ కాలనీలో నీటి పారుదలకు అడ్డంకిగా నిర్మించిన గోడ

సత్తెనపల్లి: సాగు నీటి పారుదల అడ్డంకులను తొలగించి పంటలను కాపాడాలని అమరావతి మేజర్, పాకాలపాడు మైనర్ కాలువ పరిధిలోని పంట పొలాల సాగు రైతులు గరికపాటి సతీష్, వెనిగళ్ల హరికృష్ణ, నల్లబిల్లి నరసయ్య, కె.హరి తదితరులు కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ఎస్ఎస్‌జేసీ ఈఈ మురళీధర్‌లకు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని 31వ వార్డు పరిధిలోని వావిలాల్ నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లోని మాగాణి పంట భూముల సాగుకు నీరు అందించే మైనర్ కాలువలు పూడ్చి వేసి.. వెంచర్లు వేసి.. గోడలు కట్టి ఆక్రమించడం వలన మైనర్ కాలువ పరిధిలోని పంటల సాగుకు నీటి పారుదల అవకాశాలు లేక పంటలు ఎండి పోతున్నాయన్నారు. సాగు నీటి పారుదలకు ఉన్న అడ్డంకులు తొలగించి ఎండి పోతున్న పంట పొలాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



పరిష్కార వేదికలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు వెంకటేశ్వర్లు నాయక్

కారెంపూడి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల అధికారులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించారు. పల్నాటి వీరారాధన ఉత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని అర్జీలు వచ్చాయి. గత అనుభవాల దృష్ట్యా నాగులేరులో స్నానాలు ఆచరించేందుకు వీలుగా నాగులేరు నీటి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పల్నాటి వీరుల ఆయుధాల(దైవాలు)కు పూజ కట్టుకునే నాగులేరు గంగధారి పడమర వైపు కూడా మెట్లు నిర్మించాలని, వీరాచారవంతులు విశ్రమించేందుకు వీలుగా వీరుల గుడి వాగు పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని కోరారు. మరుగుదొడ్ల సమస్యలను, వీరుల గుడి ఆవరణ, ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని వివరించారు. నాగులేరు బ్రిడ్జిపై పాడైపోయిన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. వీటితో పాటు మరో రెండు అర్జీలు వచ్చాయి. ఎంపీడీఓ జి.శ్రీనివాస రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న చైర్మన్ షేక్ చాంద్‌పాషా

మాచర్ల: పేద, మధ్య తరగతి ప్రజలు అభివృద్ధి కోసం, విద్యార్థుల ఉన్నతికి బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సహాయ సహకారాలందిస్తుందని చైర్మన్ షేక్ చాంద్‌పాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో రూ.3.50లక్షల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియంను ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు మాట్లాడుతూ తమ ప్రాజెక్టు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో 1,500ల మందికి పైగా దత్తత తీసుకొని, వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ప్రాజెక్టు మేనేజింగ్ ట్రస్టి మాటూరి సరోజినీ మాట్లాడుతూ బాలికల పాఠశాలలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. దాని ద్వారా విద్యార్థినులకు కుట్టు మిషన్ ద్వారా ట్రైనింగ్ ఇప్పిస్తున్నామన్నారు. దాని ద్వారా వారి భవిష్యత్తు సజావుగా సాగేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసు అడ్మిన్ శ్రీ శంకరయ్య, మేనేజర్ ధనలక్ష్మి, హెచ్ఎంలు రామారావు, సకీనా, డాక్టర్ కె.రామకోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మారణాయుధాలతో దాడి

దుర్గి: ముటుకూరు గ్రామానికి చెందిన గోపవరపు రాజేష్‌పై ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు వివరాల మేరకు.. తేరాల గ్రామానికి చెందిన చౌకాల సాయిబాబా, కుటుంబ సభ్యులు దాడి చేసి, గాయపరిచినట్లు తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఆర్థిక లావాదేవీలు విషయంలో స్వల్ప వివాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సాయిబాబా, అతని కుటుంబ సభ్యులు అర్ధరాత్రి సమయంలో రాజేష్ ఇంటిపై మారణాయుధాలతో దాడి చేశారని చెప్పారు. అదే సమయంలో రాజేష్, కుటుంబ సభ్యులు కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు, బంధువులు రావడంతో దాడికి పాల్పడిన వారు పారిపోయారని పేర్కొన్నారు. క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



అచ్చంపేట హరిహరక్షేత్రంలో...



పీసపాడులో కార్తిక సోమవార పూజలు



సత్తెనపల్లిలోని శివాలయంలో...

ఆలయాలకు కార్తిక శోభ

- భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- కార్తిక దీపాలు వెలిగించిన మహిళలు
- మారుమోగిన శివనామ స్మారణ



సత్తెనపల్లిలోని శివాలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నర్శింగపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి

సత్తెనపల్లి: పరమశివునికి ప్రీతికరమైన కార్తిక మాసం రెండవ సోమవారం పురస్కరించుకొని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని మహాశివునికి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకొని పరమశివుణ్ని భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్తిక మాసంలో చేసే పూజల వలన కష్టాలు తీరి కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని దుర్గా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం, గుంటూరు రోడ్‌లోని శ్రీ సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, పెదమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంతో పాటు పలు ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడి పెరగడంతో ఆయా ఆలయాల్లో భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవార పూజలు

అచ్చంపేట: కార్తిక మాసం రెండవ సోమవారం పురస్కరించుకుని వివిధ దేవాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక హరిహర క్షేత్రంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవాలయానికి భక్తులు వేకువ జాము నుంచే క్యూ కట్టారు. ధ్వజ స్తంభం వద్ద కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయ పూజారులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. నీలేశ్వరపాలెంలో స్వయంభూగా వెలసిన నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర కృష్ణానది ఒడ్డున చామర్రు కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. మదిపాడు కృష్ణానదీ తీరాన గల మల్లేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. కృష్ణానది ఉత్తరవాహినిగా ప్రవహించే పవిత్ర నందులరేవులో భక్తులు స్నానాలు ఆచరించారు.

కిక్కిరిసిన శివాలయాలు

నకరికల్లు: మండలంలోని ప్రముఖ శివాలయాలు కార్తిక సోమవారం పురస్కరించుకొని భక్తులతో కిక్కిరిశాయి. నర్సింగపాడు గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, నకరికల్లు, దేచవరం, గుండ్లపల్లి గ్రామాల్లోని మల్లేశ్వరస్వామి ఆలయం, చల్లగుండ్ల గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, చాగల్లు, కండ్లకుంట, చీమలమర్రి, కుంకలగుంట గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివార్లకు అభిషేకాలు చేశారు. స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని, అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ముప్పాళ్ల: మండలంలోని పలు ఆలయాల్లో కార్తిక సోమవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే కార్తిక స్నానం ఆచరించి పూజలు నిర్వహించారు. ముప్పాళ్లలోని కాశీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి, చాగంటివారిపాలెంలోని జగన్నాథస్వామి ఆలయం, లంకెలకూరపాడులోని ఓంకారేశ్వరస్వామి ఆలయం, మాదలలోని సంగమేశ్వరస్వామి ఆలయంలోను స్వామి వార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

కార్తిక సోమవార ప్రత్యేక పూజలు

క్రోసూరు: కార్తిక మాసం రెండవ సోమవారం మండలంలోని అన్ని గ్రామాల శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పీసపాడు గ్రామంలోని పార్వతీ సమేత నాగమల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక సోమవారం పూజలు నిర్వహించారు. అశేషంగా మహిళలు హాజరయ్యారు. దీపారాధనలు నిర్వహించారు. ఉసిరి చెట్టుకు పూజలు చేసి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అదే విధంగా క్రోసూరులోని వీరభద్ర మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లంకెలకూరపాడులోని ఓంకారేశ్వరస్వామి ఆలయంలో



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉచిత మెగా వైద్య శిబిరం



వెల్దుర్తి: సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగు జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సులభమని శ్రీకృష్ణ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణలో పరిసరాల పరిశుభ్రత పాటించి, కాచి వడపోసిన నీటిని తాగాలని కోరారు. రైతులు, రైతు కూలీలు పొలాల్లో మందులు పిచికారి చేసేటప్పుడు ముక్కు, నోటికి మాస్కను ధరించాలన్నారు. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కొని పనులు చేయాలన్నారు. ముఖ్యంగా ధూమపానం, పొగాకు దూరంగా ఉండాలని సూచించారు. 360 మంది రోగులకు ఉచితంగా ఊపిరితిత్తులు, గుండె, గ్యాస్ సమస్యలపై పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఈసీజీ, షుగర్, యూరిన్, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.